www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 21 నవంబర్ 2024

5

చిత్తూరు




మూగబోతున్న.. పసి మనసులు..

- డిజిటల్‌తో చిన్నారుల్లో సమస్యలు
- పలుకులు పలకలేక ఇబ్బందులు

సెల్‌ఫోన్లలో ఆటలు... లాప్టాప్‌లో వీడియోలను నిర్విరామంగా చూస్తున్న చిన్నారులకు కళ్ళతోపాటు పదజాలాలు దెబ్బతింటుంది. కళ్ళు సహజరంగులను గుర్తించకపోగా... గలగల మాట్లాడే చిన్నారులు మాట్లాడటంలో వెనుకబడుతున్నారు.

పూతలపట్టు మండల కేంద్రంలో చింటూ రెండేళ్ల వయసులో గలగల మాట్లాడుతూ ఆకట్టుకునేవాడు.. తరువాత ఎవరితోనూ మాట్లాడకపోవడంతో పలుకుల్లో తేడాలు కనిపిస్తున్నాయి.. అర్థం కాని భాషతో బిగ్గరగా అరవడం మొదలుపెట్టాడు. వైద్యులకు చూపిస్తే స్మార్ట్ ఫోన్‌లకు అలవాటు పడి అది తీవ్ర రూపం దాల్చడమే కారణమని గుర్తించారు.



ప్రజాశక్తి - పూతలపట్టు: భాష నైపుణ్యాలవృద్ధికి డిజిటల్ తేరలే అవరోధం. అభంశుభం తెలియని చిన్నారులు స్మార్ట్ ఫోన్లు అలవాటు పడి తెలిసి తెలియని వయసులోనే వివిధ మానసిక వ్యాధుల భారిన పడుతున్నారు. పిల్లలు ఏడవకుండా ఉండడానికి తల్లిదండ్రులు ఫోన్లను ఇచ్చి అలవాటు చేస్తున్నారు. దీనికి అలవాటు పడిన చాలామంది పిల్లలు ఇల్లు వదిలి బయటకు రాక గృహాలకే పరిమితమవుతున్నారు. దీంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఫోన్లు చూడడాన్ని, ఆపరేటింగ్ విధానాన్ని చూసి ఆనందిస్తున్నారే తప్ప ఇందువల్ల కలిగే అనర్ధాలను చాలావరకు గుర్తించడం లేదు. ఆకులు కాలాక చేతులు పట్టుకునే విధంగా పిల్లల పరిస్థితి తీవ్రరూపం దాల్చాక ఆస్పత్రి వైపు పరుగులు తీస్తున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోతుంది. కొందరైతే మానసిక స్థిమితం కోల్పోవాల్సి వస్తుంది. పిల్లల పరిస్థితులకు తల్లిదండ్రులే కారణమని వైద్యులు అంటున్నారు.

పద సంపద తక్కువ..

గతంలో అమ్మమ్మలు నాయనమ్మలు ముచ్చట్లతో మాటలు నేర్పేవారు ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరు ఏవో ఒక పనిలో నిమగ్నం అవడంతో పిల్లలకు ఫోన్లు, ట్యాబులను ఇచ్చేస్తున్నారు. వాటికి అతుక్కుపోతున్న పిల్లల్లో భాష నైపుణ్యాలు దెబ్బతింటున్నాయి. సెల్‌ఫోన్లు అధికంగా చూసే వారిలోనే పద సంపద తక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. కొందరైతే పూర్తిగా మాటలు కోల్పోయిన సందర్భాలు కూడా కనిపిస్తున్నాయి.

భాష మనుగుడకే ప్రమాదం...

గత ఏడాది విద్యాశాఖ చేపట్టిన లిప్ ఎన్సీఈఆర్టీ కార్యక్రమాల్లో విద్యార్థులు పదాలు పలకడానికి ఇబ్బంది పడడం గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర ఆరోగ్యస్వస్థ కార్యక్రమంలోని ఫలితాలు సైతం దీన్ని రుజువు చేస్తున్నాయి. చిన్నారులకు డిజిటల్ తెర వసనంగా మారడంతో మూలమైన భాష కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఇప్పుడిప్పుడే జటిలమవుతోందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. దీనిని తల్లిదండ్రులు గ్రహించి పిల్లలను తెరకు దూరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



తల్లిదండ్రుల తప్పిదంతోనే..

- ప్రియాంక, పూతలపట్టు పాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు.

పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుతున్నది తల్లిదండ్రులే. ఫోన్లకు అలవాటైనా పిల్లల్లో భాష నైపుణ్యాలు పెరగవు. సమస్యను మొదటి స్థాయిలోనే గుర్తిస్తే సమస్య త్వరగా నివారించవచ్చు ఇలాంటివారు తమకు కావాల్సింది దక్కనప్పుడు తమ భావాన్ని కొరకడం కొట్టడం తలబాదుకోవడం వస్తువులు విసిరేయడం వంటివి చేస్తుంటారు. ఇటువంటి వారికి వెంటనే వైద్యులను సంప్రదించాలి.

బంతి పూలు.. రోడ్డు పాలు

- కిలో రూ.5లకు పడిపోయిన ధర
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



ప్రజాశక్తి- గంగవరం

బంతిపూల ధరలు పతనవడంతో పూల పంట పండించిన రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. గత నెలలో రూ.42 నుంచి 50లు ధర ఉన్న పూలు ప్రస్తుతం రూ.5 నుంచి 10లకు పడిపోవడంతో బంతిపూలను అత తక్కువ రేటుకు ఇవ్వడానికి మనసు రాక రోడ్డు పక్కనే పారబోసి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. మండలంలోని పడమటి పంచాయతీలలో కర్ణాటక ములబాగుల, బెంగళూరు దగ్గరగా ఉండటంతో సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు రైతులు ఎక్కువగా పూల పంటపై ఆసక్తి చూపుతుంటారు. దసరా, దీపావళి, కార్తీక పూజలు, అయ్యప్ప మాలలు ధరించి స్వాములు పూజలకు ఎక్కువగా పువ్వులు కొనుక్కుంటారని ఆశతో పూల పంటలు సాగు చేస్తారు. అయితే ఈసారి వారి ఆశలు అడియాశలు అయ్యాయి.

రైతు సవిరి రాజు మాట్లాడుతూ తనకున్న అర ఎకరా భూమిలో బంతిపూల పంటను సాగు చేశారని, అందుకు రూ.25 వేల నుంచి 30 వేల వరకు ఖర్చు అయ్యిందని తెలిపారు. పూలకు ధరలు బాగా ఉన్నప్పుడు రూ.60వేలు దాకా చేతికొచ్చేదని తెలిపారు. అయితే ఈరోజు క్వింటాల పూలు దగ్గరలోని కర్ణాటక నందిన మార్కెట్‌కు తరలించగా కేవలం రూ.200లు మాత్రం చేతికి వచ్చిందని ఇలాంటి సమయంలో కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడంలేదని, పెట్టిన పెట్టుబడి రాకపోగా అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.



మహిళ రైతు లక్ష్మమ్మ మాట్లాడుతూ తమకున్న రెండు ఎకరాలలో బంతిపూలు సాగు చేశామని తెలిపారు. దసరా దీపావళి పండుగ సమయంలో కిలో ధర రూ.40 నుంచి 50లు పలికిందని, దాని దృష్టిలో ఉంచుకొని మళ్లీ బంతిపూలు సాగు చేయడంతో ఇప్పుడు కనీసం పెట్టిన ఖర్చు కూడా చేతికి రాలేదని కూలీలను పిలిస్తే వారికి కూలీలు ఇవ్వలేక కుటుంబంలోని సభ్యులు, పిల్లలే పూల కోసి మార్కెట్‌కు పంపుతున్నామని తెలిపారు.



ఆధునిక అంబులెన్సులు ఇవ్వండి

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్సులను కేటాయించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. జిల్లాలో అత్యంత కీలకమైన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం పాత అంబులెన్స్ ఉందని.. ఆధునిక సౌకర్యాలతో కూడిన, ఎమర్జెన్సీ సేవలు సైతం అందించగలిగే అంబులెన్సులను కేటాయించాలని కోరారు. ప్రధానంగా అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, వెంటిలేటర్ సౌకర్యం కలిగిన కార్డియాక్, బేసిక్ లైఫ్ సపోర్ట్ కలిగిన జిపిఎస్ అంబులెన్సులకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. జాతీయ రహదారిపై ఉన్న గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే వినతులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర రాష్ట్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. చిత్తూరు ఆసుపత్రికి అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్, వెంటిలేటర్ సౌకర్యం కలిగిన కార్డియాక్, బేసిక్ లైఫ్ సపోర్ట్ కలిగిన జిపిఎస్ అంబులెన్స్‌ల కోసం నిధులు కేటాయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేయడం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉందని, ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వీవోఏలపై వేధింపులు మానుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలోని వీవోఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాకు వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ వేధింపులు ఉండవని, మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేస్తామని, హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కారం చేయకపోవడంతో



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

పెద్దఎత్తున పోరాటం చేసి ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఓడించిన పరిస్థితి ఉందన్నారు. జిల్లాలో ఇష్టారాజ్యంగా రాజకీయ వేధింపులు పాల్పడుతూ తొలగించడం దారుణమన్నారు. ఇప్పటికే 123మందిని తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. కొన్ని మండలాల్లో ఏపీఎంలు, సీసీలు వైఖరి దారుణంగా ఉందని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లోనైనా వీరి సమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ హెచ్చరిక

కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంలు, సీసీలు సెర్ప్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వీవోఏలను తొలగిస్తే చర్యలు తీసుకుంటామని ఆ పద్ధతిలో డిఆర్‌డిఏ పీడీ ద్వారా సర్క్యులర్ పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, నాయకులు వసంత, నాగరాజు, శీనప్ప, ఉమాపతి పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై శంఖారావం పేరుతో ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం నేతృత్వంలో ఈనెల 26వ తేదీ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేపట్టనున్నట్లు ట్రేడ్ యూనియన్, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ట్రేడ్ యూనియన్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతల సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి సురేంద్ర అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు, కార్మికులు, సామాన్య ప్రజానీకం అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలను తీవ్రతరం చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ మేరకు జాతీయ ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు వ్యవసాయ సంఘాల పిలుపుమేరకు ఈనెల 26వ తేదీ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, రైతు సంఘం నాయకులు శంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర గుప్తా, ప్రజాసంఘాల నాయకులు బంగారు మురళి, భువనేశ్వరి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాస్థాయి ఆసుపత్రులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లాస్థాయి ఆసుపత్రుల నాణ్యత ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ డిఎం అండ్‌హెచ్ఓ ప్రభావతీ దేవితో కలసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఆసుపత్రులలో ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ పనిచేసేలా కృషి చేయాలని తెలిపారు. దీనితో పాటు ఆస్పత్రులలో సరైన ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ, వసతులు కల్పించుటలో ఆసుపత్రులకు కావలసిన సదుపాయాల కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆస్పత్రిలో నిరుపయోగమైన బయో మెడికల్ వ్యర్థాలను తొలగించేందుకు సరైన విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలో అనుకోని సందర్భాలలో ప్రమాదాలు ఏర్పడితే



వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు నివారణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు సరి చూసుకోవాలన్నారు. డయాగ్నస్టిక్ సేవలు, ల్యాబోరేటరి సేవలు, శస్త్ర చికిత్స సదుపాయాలు, కాన్పు సేవలకు అవసరమైన సదుపాయాలు, పేషెంట్‌కు కావలసిన నాణ్యత ప్రమాణాలు కావలసిన వనరులపై సమీక్షించారు. జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ వివరాలు సమీక్షించి, లోపాలను సరిచూసుకుని ప్రణాళిక ద్వారా వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా జిల్లా స్థాయి ఎన్‌క్యూఏఎస్ క్వాలిటీ అధికారి డాక్టర్ నిరంజన్ రెడ్డి, జిల్లా క్వాలిటి మేనేజర్ డాక్టర్ దివ్య నాణ్యతా ప్రమాణాలపై నివేదక అందజేశారు.

'అపార్' జనరేషన్‌పై సమీక్ష

ఆధార్ లో సవరణలను వెంటనే పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యార్థులకు అపార్ కార్డుల మంజూరుకు సంబందించి ఆధార్‌లో సవరణలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా అపార్ జనరేషన్‌పై డీఈఓ, సమగ్ర శిక్ష ఎపిసి, డిఎల్‌డిఓ, డివైఈఓ, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, మునిసిపల్ కమిషనర్లు ఇతర సంబందిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 71.87శాతం అపార్ జనరేషన్ పూర్తి అయ్యిందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు అపార్ కార్డు మంజూరుకు విద్యాశాఖ, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాల వారు విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆధార్ సెంటర్లకు పంపకుండా సంబందిత ఎంపిడిఓ, మండల విద్యాశాఖ అధికారులు మొబైల్ ఆధార్ సెంటర్ ద్వారా ఆధార్ సవరణను పాఠశాలల స్థాయిలో చేయాలన్నారు. ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఆధార్ సవరణకు సంబందించి వచ్చే దరఖాస్తులను వారి లాగిన్‌లో ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ఆధార్ సవరణాలను పూర్తి చేయాలన్నారు. ఆధార్ సవరణకు సంబంధించి విద్యాశాఖ అధికారులు, సంబందిత తహశీల్దార్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. అపార్ విద్యార్థుల గుర్తింపు కార్డుల జారీకి సంబంధించి నోటరీ, అఫిడవిట్ అవసరం లేదని పంచాయతీ సెక్రేటరీలు వారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఆధార్ అప్డేషన్‌కు సంబందించి ఉన్న కరెక్షన్స్‌ను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

'విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని మెప్మా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి కేంద్రాన్ని ఆర్కే విద్యాలయ డిగ్రీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సపోర్ట్ సంస్థ అధ్యక్షులు వసతి గృహ నిర్వాహకులు జోసెఫ్ రాజ్ మాట్లాడుతూ అభాగ్యులు, ఒంటరి స్త్రీలు, వృద్ధులు, వికలాంగులు, అనాధలు వసతిలేని వారికి నిరాశ్రయుల వసతిగృహంలో వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండి సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని, తల్లిదండ్రులపై ప్రేమతో మెలగాలని కోరారు. ఆర్కే విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం అలవర్చుకొని పేదలకు తనవంతు సాయం అందించాలన్నారు. డిగ్రీ విద్యార్థులు ఆశ్రయం పొందుతున్న వారిని వసతిగృహంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిరాశ్రేయలతో ఆప్యాయంగా మాట్లాడారు. 30 మంది డిగ్రీ విద్యార్థులు, సిబ్బంది, శశిరేఖ, శ్రీనివాస, సెల్వి పాల్గొన్నారు.



బైపాస్ అంటే భయమేస్తోంది..

తిరుత్తణి రోడ్డులో తప్పని తిప్పలు

అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

తిరుత్తని బైపాస్ రోడ్డు కట్టమంచి గుండా పుత్తూరు ప్రధాన రహదారి కలిసే రోడ్డు. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు బయపడి వణికి పోతున్నారు. రోడ్డు మొత్తం గుంతలు గతుకులతో అధ్వానంగా ఉంది. దీనికి తోడు భారీ వాహనాలు ఇరుకు రోడ్లలో ప్రయాణకష్టాలు వర్ణాతీతంగా తయారైంది. ఈ బైపాస్ రోడ్డు కట్టమంచి, చంగల్రాయ్ మెట్ట, సాంబయ్యకండ్రిగ మీదగా దాదాపు 6 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్లు బాగా పాడైపోయి గుంతలు గతుకులతో చాలా అధ్వానంగా ఉంటే గతంలో వైసిపి నాయకులు విజయానందరెడ్డి తన సొంత నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం వానలకు, భారీ వాహనాల రాకపోకలకు రోడ్లు మొత్తం మళ్లీ అధ్వానంగా తయారైంది. భారీ వాహనాలు చిత్తూరు నగరంలోకి అనుమతి లేని కారణంగా ఈ రోడ్ల గుండా చెన్నై ఇతర రాష్ట్రాలకు వెళుతుంటాయి. ఈ రూట్లో ప్రయాణించడం ఒక ఎత్తైతే.. ఈ ఊళ్లను దాటడం మరో ఎత్తు. కట్టమంచి, చంగల్రాయ మెట్ట ఇతర ప్రాంతాలలో రోడ్లు ఆక్రమణకు గురై ఇరుకుగా తయారయ్యాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ద్విచక్ర



వాహనదారులు, భారీ వాహనదారులు ఈప్రాంతంలో ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. కట్టమంచి, చంగల్రాయిమెట్ట, సాంబయ్య కండ్రిగ మొదలైన ప్రాంతాల్లో ఆకతాయులు ఈ ఇరుకు రోడ్ల పైన బైకులను నిలిపి నానా హంగామా చేయడం వలన వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సగానికి పైగా రోడ్లను ఆక్రమించి గుంపులు గుంపులుగా నిలబడి వెకిలిచేష్టలు చేస్తూ ద్వంద్వఅర్థాల మాటలు మాట్లాడుతూ ఇటు స్థానికులను అటు వాహనదారులను విద్యార్థులను మానసిక వేదనకు గురి చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో బర్తడే పార్టీల పేరుతో రోడ్లపైన కేకులు కట్ చేసి టపాకాయలు పేల్చి వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బహిరంగంగా మద్యం తాగి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో పిల్లలు, మహిళలు, ఆడపిల్లలు బయటకు రావాలంటే భయపడిపోతున్నారు.

గతంలో స్కూల్ కాలేజీ వేళల్లో పోలీసులు గస్తీ ఉండేది ప్రస్తుతం పోలీసుల గస్తీ లేకపోవడంతో వీరి ఆగడాలు శృతిమించి పోతోంది. వీటన్నింటిని తప్పించుకుని బయటపడితే రోడ్లపైనే చెత్తాచెదారం వేయడంతో దుర్గంధంతో ముక్కున వేలు వేసుకొని వెళ్లాల్సి వస్తుంది పారిశుద్ధ్యం అంత అద్వానంగా ఉంది మరి. ఆ ప్రాంతాలలో కార్పొరేషన్ సిబ్బంది చెత్తకుండీలను ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు రోడ్లపైనే చెత్తాచెదారం పారబోస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, విద్యార్థులు, వాహనదారులు దుర్గంధంతో ముక్కులు మూసుకొని ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఇది ఇలా ఉంటే ఆ ప్రాంతాలలో కుక్కలు రోడ్లు పైన గుంపులు గుంపులుగా చేరి వాహనదారులను పాదచారులను వెంటబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పై సమస్యలకు పరిష్కాం మార్గంగా ప్రస్తుతం ప్రభుత్వం అంతరాష్ట్ర రోడ్ల విస్తరణ, మరమ్మతులు, నిర్మాణాల కోసం వెచ్చించిన నిధులతో ప్రధమంగా ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

సిసి రోడ్ల పనులను

డిసెంబర్ 20 లోపు పూర్తిచేయాలి



సిసి రోడ్ల పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి గాను మంజూరైన 1500 అంతర్గత సిసి రోడ్ల నిర్మాణంలో భాగంగా పురోగతిలో వున్న 612 పనులను డిసెంబర్ 20వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024- 25 సంవత్సరానికి మంజూరైన అంతర్గత సీసీ రోడ్స్, అప్రోచ్ రోడ్స్, బీటీ రోడ్స్, ఎంపీ ల్యాండ్స్ కింద మంజూరైన పనుల పురోగతిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్గత సిసి రోడ్లకు సంబంధించి 1500 మంజూరు కాగా 1018 పనులు గ్రౌండింగ్ అయ్యాయని, ఇందులో 406 పనులు పూర్తి కాగా 612 పనులు పురోగతిలో కలవని తెలిపారు. పనులు పూర్తి అయిన 406 పనులకు సంబంధించి 269 పనులకు గాను రూ.13.14 కోట్లు బిల్స్ ఆన్లైన్‌లో అప్లోడ్ చేయగా 163 పనులకు సంబంధించి రూ.7.95కోట్లు చెల్లింపులు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన సిసి రోడ్లను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పి ఆర్, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేసి నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టిమేషన్ కాస్ట్, బిల్స్ అప్లోడింగ్, పనుల పురోగతిపై డ్వామా పిడి, ఎస్ఈపిఆర్‌లు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. వర్క్ ఐడి క్రియేట్ చేసి జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. పిఆర్ యాప్‌లో పనుల పురోగతిని సంబంధించిన వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజక వర్గాలవారీగా పనుల పురోగతి, పనులు ప్రారంభించక పోవడానికి గల కారణాలను సమీక్షిస్తూ ప్రజాప్రతినిధులతో చర్చించి త్వరితగతిని ప్రారంభించేలా, పనులు జరుగుతున్న చోట పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎంపి ల్యాడ్స్ కింద మంజూరైన పనులకు సంబందించి పురోగతిపై కూడా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిసి రోడ్స్ (అప్రోచ్ రోడ్స్) సంబందించి 34 పనులు మంజూరు కాగా 25 పనులు గ్రౌండింగ్ చేయగా 6 పనులు పూర్తి అయ్యాయని, 19 పురోగతిలో ఉన్నాయని, బిటి రోడ్లకు సంబంధించి 12 పనులు మంజూరు కాగా పనులన్నీ పురోగతిలో ఉన్నాయని పిఆర్ఈఈ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, పిఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, సంబంధిత డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నీటి వృథా పట్టించుకోరే.?


వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి రూరల్ మండలం గుండ్రాజు కుప్పం పంచాయతీ రామాపురంలో తాగునీటి కొళాయి మరమ్మతులకు గురైంది. నీరంతా వృథాగా పోతున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులంటున్నారు. ముందస్తు చర్యలు తీసుకొని నీటి వృథా అరికట్టాలని జిల్లా అధికారులు చెప్పుతున్నా.. మండల స్థాయి అధికారులు వాటిని పట్టించుకోలేదు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుకుంటున్నారు.

'చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించాలి'


చల్లా బాబుకు విన్నవిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో చేపలు విక్రయించేందుకు కావాల్సిన మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా బాబును బుధవారం వెంకటేశ్వర మత్స్యకార సంఘ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర ఫిషర్ మ్యాన్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు చేపల విక్రయానికి అవసరమైన స్థల కేటాయింపునకు గతంలో అనేక ఉద్యమాలు చేశామని అయినా తమ సమస్యను పరిష్కరించలేదన్నారు. మత్స్యకారులు ఎన్నో ఏళ్ళుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ది పొందులేదు అన్నారు. అనంతరం మత్స్యకారుల సంఘ సభ్యులతో చల్లా బాబు మాట్లాడుతు గత ప్రభుత్వంలో బిసి కులాలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదన్నారు. ఉమ్మడి కూటమి ద్వారా మీరు కోరిన పుంగనూరులో చాపల మార్కెట్‌కు కావలసిన స్థలం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కుమార్, ధర్మ తేజ, కమిటీ సభ్యులు కామేశ్వరరావు, దొరస్వామి, రఘుబాబు, రఘుబాబు, ప్రకష్‌లు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షులు నేతాజీ నాయుడు కోరారు. బుధవారం చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల గ్రూపులకు రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి నీర జాక్షులు గౌడ్, ఏపీవో రవి, మండల వ్యవసాయ సంఘం నాయకులు రామచంద్ర నాయుడు, విజయేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టార్పలిన్ పట్టలు పంపిణీ

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు టార్పలిన్ పట్టలు పంపిణీ చేశారు. స్థానిక ఐకెపి భవనంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో టార్పలిన్ పట్టలను ఏపిఎం సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

అనారోగ్యంతో పాత్రికేయుడు మృతి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: పెనుమూరు మండలం గుట్టకిందపల్లి హరిజనవాడ గ్రామానికి చెందిన శివ శంకర్ పాత్రికేయునుగా కొనసాగుతున్నాడు. అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్నా జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్న యుగంధర్ కార్యకర్తలతో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థిక సహాయం అందించారు. గతంలో శివ పెనుమూరు మండలానికి ప్రజాశక్తి విలేకరిగా పనిచేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఉపాధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షురాలు రేణుక, యువజన అధ్యక్షులు గురు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నరేంద్ర ఉన్నారు.

గ్రామ సభకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం పెద్దబొగ్గుపల్లి, చిన్నబొగ్గుపల్లిలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి పాల్గొన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రైతులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వినతుల రూపంలో అధికారులకు సమర్పించారు. పరిశీలించిన అధికారులు సమస్యలన్నింటినీ పరిశీలించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న చెక్కునత్తం మణి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- కడా పీడీ వికాస్ మరమత్

ప్రజాశక్తి-రామకుప్పం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ వేదికలో పరిష్కారం అవుతుందని కడా పీడీ వికాస్ మరమత్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో కడా పీడీ అధ్యక్షతన ప్రజా దర్బార్ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే సాంప్రదాయాన్ని తిరగరాసి అధికారులే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రానున్న ఐదేళ్లలో సమస్యలు లేని గ్రామాలుగా మార్చాలన్నదే ధ్యేయమన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి 26శాఖల



అధికారులు వినతి పత్రాలను స్వీకరించారు. రెవిన్యూ, హౌసింగ్ ఎంపీడీవో, మెడికల్, విక్టరీ తదితర సమస్యలపైన 407అర్జీలను ప్రజలు అధికారులకు అందించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి బోర్డ్ మెంబర్ శాంతారామ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసరాజు, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, తహశీల్దార్ బాబు, ఎంపీడీవో లక్ష్మి కాంత్, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, రామ్మూర్తి, చలపతి, సీతాపతి, చిన్ని కృష్ణ, జయశంకర్, గంట్లప్ప గౌడు, విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీపీవో పార్వతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: క్షేత్రస్థాయిలో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో పార్వతి అన్నారు. బుధవారం చౌడేపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీ సచివాలయాల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. 90 రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసుకుని ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చౌడేపల్లి, సోమల ఎంపీడీవోలు లీలా మాధవి, నారాయణ ఈవో ఆర్డీలు కృష్ణవేణి లక్ష్మీదేవి మండలంలోని పంచాయతీ సచివాలయాల కార్యదర్శిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో పార్వతి

సదుం: సదుం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈఓపిఆర్‌డి వర ప్రసాద్ ఆధ్వర్యంలో డీపీవో సమీక్షలు నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగు నీరు సరఫరా, వీధి దీపాలు నిర్వహణ, తదితర అంశాలపై ఆమె సమీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సోమల ఎంపిడిఓ నారాయణ, ఈఓపిఆర్‌డి లక్ష్మీ దేవమ్మ, సదుం పంచాయతీ ఈఓ హసీనా, పంచాయతీ కార్యదర్సులు తులసి క్రిష్ణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గం కొండ అభివృద్ధి పనులకు అనుమతులు లేవు

- అటవీ శాఖ పుంగనూరు రేంజర్ శ్రీరాములు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న దుర్గం కొండ అభివృద్ధి పనులకు అనుమతులు లేవని ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి పనులను వెంటనే నిలిపివేయాలని పుంగనూరు అటవీ శాఖ రేంజర్ శ్రీరాములు తెలిపారు. ఆయన ఆదేశాలతో పెద్ద ఉప్పరపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుధవారం మధ్యాహ్నం అటవీ శాఖకు చెందిన పలువురు అధికారులు దుర్గం కొండకు చేరుకొని ఇక్కడ అభివృద్ధి పనులకు ఎలాంటి అనుమతులు లేవని వెంటనే చేస్తున్న నిర్మాణ పనులను ఆపివేసి యంత్రాలను ఇక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. దీంతో విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకొని అధికారులను నిలదీశారు. రేంజర్ శ్రీరాములును ప్రజాశక్తి వివరణ కోరగా


మాట్లాడుతున్న అటవీశాఖ రేంజర్ శ్రీరాములు

ఇప్పటివరకు జరిగిన ప్రస్తుతం జరుగుతున్న దుర్గం కొండ ఆలయ అభివృద్ధి పనులకు అటవీ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పై అధికారుల ఆదేశానుసారం అభివృద్ధి పనులను చేయరాదని కాంట్రాక్టర్‌కు సూచించడం జరిగిందని తెలిపారు. కాంట్రాక్టర్ తమకు అనుమతులు ఉన్నట్లు ఆదేశాలు తీసుకువస్తే పూర్తిస్థాయిలో విచారించి పనులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు పనులను నిలుపుదల చేయాలని కోరినట్లు తెలిపారు.

'నా భార్య ఆచూకీ కనిపెట్టండి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తన భార్య ఆచూకీని కనిపెట్టి తనకు న్యాయం చేయాలంటూ బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రఘువర్మ మీడియాను ఆశ్రయించారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మడుపోలూరు గ్రామానికి చంద్రశేఖర్ నాయుడు కుమార్తె బిర్లానును ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. తాను దళిత కులానికి చెందినవాడు కావడంతో వివక్షత చూపుతూ తమను వేరు చేయడానికి తమ అత్తమామలు ప్రయత్నించి తన భార్యను కిడ్నాప్ చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అత్తమామ చంద్రశేఖర్



నాయుడు, రుక్మిణిలు తమను విడదీయడానికి కుట్ర చేశారని, ఇందులో భాగంగా తన భార్యను కిడ్నాప్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇద్దరు బిడ్డలు తల్లి కోసం దిగులు చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్యను అప్పగించి కిడ్నాప్ చేసిన అత్తమామలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. పోలీసులు స్పందించి తన భార్య ఆచూకిని తెలపాలని వేడుకున్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆనుకొని ప్రభుత్వ స్థలం ఉంది. ఓ మైనారిటీ కుటుంబం ఇంటి స్థలం నిర్మించుకున్నారు. అక్రమాలు తొలగించాలని స్థానికులు గతంలో రెవిన్యూ వారికి ఫిర్యాదు చేశారు. బుధవారం రెవెన్యూ వారు, ఎంపీడీవో, పోలీస్ వారి సహాయంతో అక్రమ నిర్మాణాలను జెసిబి యంత్రంతో నేలమట్టం చేశారు. బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. తమ ఇంటిని కూల్చవద్దు మహాప్రభు అని పోలీసులు కాలు మీద పడి బోరును వినిపిస్తున్నా పట్టించుకోలేదని వాపోయారు. తమకు సెంటు స్థలం లేదని, గతంలో ఎన్నో ఏళ్ల నుంచి తాము అక్కడే జీవిస్తున్నట్లు తెలిపారు. కడుపు కొట్టకండి, పేదవారి కడుపు కొడితే మీకేం వస్తుంది అయ్యా.. మా ఇంటిని కూల్చకండి అయ్యా అని ఆ మహిళ



ప్రాధేయపడింది.

నిబంధనల మేరకే తొలగించాం: తహశీల్దార్ రమేష్ బాబు

అక్రమ కట్టడాలపై మాకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు గత నెలలో ఆ కుటుంబానికి మా సిబ్బంది ద్వారా నోటీసులు పంపించాము. పై స్థాయి అధికారుల ఆదేశాలు మేరకు అక్రమ కట్టడాలను తొలగించాం.

ఆదమరిస్తే అపాయమే.!

ప్రజాశక్తి-చిత్తూరు టౌన్: చిత్తూరు–తిరుపతి ప్రధాన రహదారి పైన రక్షణ వలయం లేని ట్రాన్స్ఫార్మర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రతినిత్యం ఈ రహదారిపై తిరుమలకు తమిళనాడు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇతర ఊర్లకు ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, స్కూలు కాలేజీ బస్సులు ప్రయాణించే ఈ రహదారిపై ట్రాన్స్ఫార్మర్లు రూపంలో అపాయం పొంచి ఉండడం గమనార్హం. ఈ రహదారి పైన పెట్రోల్ ట్యాంకర్లు, గ్యాస్ వాహనాలు, ప్రమాదకరమైన ఇతర రసాయన వాహనాలు వెళుతుంటాయి. ఈ వాహనాలు అదుపుతప్పి ట్రాన్స్ఫార్మర్ ఢీకొంటే ప్రమాదం ఊహించలేం. అదేవిధంగా స్థానికంగా కళ్యాణ మండపాలు, దేవాలయాలు అధిక సంఖ్యలో కట్టమంచలో



ఉన్నాయి. ఈ రోడ్లు ఇరుకు కావడంతో వాహనాలు భారీగా రావడంతో ట్రాన్స్ఫార్మర్ పక్కగా వెళ్లాల్సి వస్తోంది. పాదచారులు అదుపుతప్పి వాటిపైన పడితే కరెంటు తీగలు వారికి తాకితే ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్లకు రక్షణ వలయాలు రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



ప్రజాశక్తి-విజయపురం: ఎద్దల బండిపై ఇసుక తరలించి అమ్మకోవచ్చు.. డంపింగ్ చేసుకోవడానికి అనుమతి లేదని తహశీల్దార్ కిరణ్ తెలిపారు. బుధవారం ఎస్ఐ బలరాంతో పాటు, తహశీల్దార్ కిరణ్, మైనింగ్ అధికారులు కేవీ శ్రీరామపురంలోని కుశస్థలి నది పరిశీలించారు. అనంతరం కేవీ శ్రీరామపురం కాలనీ ఎద్దల బండి యజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బలరాం మాట్లాడుతూ ఇసుక అవసరమైన వారు ఎవ్వరైన ఎద్దల బండి, ట్రాక్టర్‌తో ఇసుక తీసుకోవచ్చు అన్నారు. అయితే డంపింగ్ చేసి తమిళనాడుకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం వరకే ఇసుక తీసుకోవడానికి అనుమతి ఉందని, రాత్రి పూట ఇసుక తరలించడం చట్ట రీత్యా నేరమన్నారు. అలాగే అగ్రికల్చర్ ట్రాక్టర్‌తో ఇసుక తరలించకుండా కమర్షియల్ ట్రాక్టర్‌తోనే ఇసుక తరలించాలని సూచించారు. ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసామని హెచ్చరించారు. లబ్ధిదారులకు అనువైన ధరకే ఇసుకను అమ్ముకోవాలన్నారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి



ప్రజాశక్తి-కుప్పం టౌన్: టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను కుప్పం పట్టణం మోటర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. టిప్పు యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టిడిపి మైనారిటీ విభాగం కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్ అహ్మద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా టిప్పు సుల్తాన్ చిత్రపటానికి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన స్వాతంత్ర సమరయోధుడిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఫైరోజ్, హఫీజ్, సర్దార్, నబి, అల్లా బగష్, ఉమర్, ఇర్ఫాన్, జాలు, ఖాసీం, ఇమ్రాన్, ఖలీల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గోకుల షెడ్లలో నిర్మాణాలపై, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని గోకులం షెడ్లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ జెడి ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గోకుల షెడ్డుల నిర్మాణం, రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులందరూ మినీ గోకులాల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశుసంవర్ధక శాఖ ఏడి మురళీమోహన్, ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, ఉపాధి హామీ ఏపిఎం శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు రైతులు పాల్గొన్నారు.

డివైడర్ ను ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు

వజాశక్తి-గుడిపాల: లారీ డివైడర్ ను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గుడిపాల మండల పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల వివరాల మేరకు టిఎన్ 52 కె 2224 లారీ చిత్తూరు వైపు నుండి చెన్నై కి వడ్లు లోడుతో వెళ్తున్నది.ఈ నేపథ్యంలో అనుపు సబ్ స్టేషన్ వద్ద రోడ్డు మరమత్తు నిమ్మితం అడ్డుగా పెట్టిన సిమెంటు డివైడర్లను డ్రైవర్ గమనించకపోవడంతో డివైడర్ ను లారీ ఢీకొని బోల్తా పడింది. లారీ డ్రైవర్ పళని వేల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతను తమిళనాడు రాష్ట్రంలోని సేలం కు చెందిన వ్యక్తి గా గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది శివ అత్యవసర చికిత్స అందిస్తూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంతో గంట సేపు పైగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీనిపై కేసు నమోదు చేసి తర్వాత చేస్తున్నట్లు గుడిపాల పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- భారీగా బంగారు నగలు స్వాధీనం - రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు సీజ్


మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలను, కార్లను దొంగలించి వాటి ద్వారా ఒంటరిగా ఉండే మహిళల మెడలో గొలుసులను దొంగలించడం, హౌస్ బ్రేకింగ్‌కి పాల్పడే శివకుమార్, సయ్యద్ రహమాన్, అబ్బు అలియాస్ పరశురాం, కుమార్ అనే నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పూతలపట్టు పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బుధవారం చిత్తూరు పోలీసు అతిథి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను, చోరికి గురైన ఆభరణాలను, ద్విచక్ర వాహనాలను, కారును పోలీసులు మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పూతలపట్టు, ఐరాల మండలాలలో అక్టోబర్ 26న తేదీన వరుస చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరగడం కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు కర్ణాటక, తమిళనాడు, ఏపీ రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్లను సందర్శించి, పాత నేరస్తుల సమాచారం సేకరించారన్నారు. విచారణలో నిందితుల ముఠాను గుర్తించి, మంగళవారం బెంగళూరు–తిరుపతి హైవేలోని జగమర్ల క్రాస్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఒక మారుతీ స్విఫ్ట్ కారు, ఒక పల్సర్ మోటార్ సైకిల్, ఒక కెటిఎమ్ డ్యూక్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా అక్టోబర్ 26వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పూతలపట్టు మండలంలోని కిచ్చన్నగారిపల్లి గ్రామం వద్ద బెంగుళూరు–తిరుపతి ఎన్‌హెచ్ –44 సర్వీస్ రోడ్డులోని ఆనంద భవన్ హోటల్ సమీపంలో నిందితులు మారుతి కారు, మోటారు సైకిల్‌పై వచ్చి పొలాలకు వెళ్తున్న ఓ మహిళ మెడలోని 64గ్రాముల బంగారు గొలుసు విలువ సుమారు రూ.3,50,000 లాక్కొని, తిరుపతి వైపు పారిపోయారు. ఈ ఘటనపై పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో తేనేపల్లి చైన్ స్నాచింగ్, ఐరాల –గుండ్లపల్లి బస్టాప్ చైన్ స్నాచింగ్ కేసులలో ప్రధాన నిందితుడు శివకుమార్ యువకులను డబ్బు, గంజాయి, మద్యంతో ప్రలోభపెట్టి, వారితో ఒక నేర ముఠాగా ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. రెహన్, అబ్బు అలియాస్ పరశురాం, కుమార్ అలియాస్ కుళ్ల చంద్రశేఖర్‌తో కలిసి శివకుమార్ పలు నేరాలకు పాల్పడేవాడని ఎస్పీ వివరించారు. నేరాలకు కావలసిన సెకండ్ హ్యాండ్ కార్లు మోటార్ సైకిళ్లు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దొంగిలించబడేవన్నారు. ఈ వాహనాలను ఉపయోగించి చైన్ స్నాచింగ్, దోపిడీలు, ఇంటి దొంగతనాలు చేయించేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిందితుడు శివకుమార్‌పై కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు, దొడ్డబల్లాపూర్, హోస్కోట్, కోలార్, ఇతర జిల్లాలలో 40కి పైగా నేర కేసులు నమోదైనట్లు వివరించారు. అంతే కాకుండా శివకుమార్ ప్రేమ జంటలు కనిపిస్తే వారిని వెంబడించి, బెదిరించి వారి వద్ద ఉండే ఫోన్లను, డబ్బును ఇతర విలువైన వస్తువులను దోచుకునేవాడని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు ఎస్పీ మణికంఠ చందోలు డిఎస్పి సాయినాథ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-గంగవరం: చెన్నై బెంగళూరు జాతీయ రహదారి గంగవరం పరిధిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వేగంగా వస్తున్న బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. విజయవాడ నుంచి నలుగురు స్నేహితులు కలిసి బైక్‌లో తమిళనాడుకి విహారయాత్ర వెళుతుండగా రైజర్ వాహనాలలో అతివేగంగా వచ్చి ఆటోను తప్పించబోయి బైక్ అదుపు తప్పింది. డివైడర్‌కి ఢీకొనడంతో హర్షిత్(30) అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ ప్రసాద్ తెలిపారు. అతివేగంతో రావడమే ప్రమాదానికి కారణం అని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి అక్రమ రవాణా.. ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేజీ గంజాయిని చిత్తూర్ టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. గంజాయి అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు.. గురువారం నిఘా ఉంచిన పోలీసు సిబ్బందికి అనుమానితులుగా బెంగళూరుకు చెందిన అల్లాబక్షు, ఇరువారానికి చెందిన తులసి, ప్రశాంత్ నగర్ సురేష్‌లు కంటపడడంతో వెంబడించి పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వైజాగ్ ఏజెన్సీ, ఒరిస్సా ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి చిత్తూరులో యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. పట్టుబడ్డ నిందితులను కోర్టు ఎదుట హాజర పరచనున్నట్లు సీఐ తెలిపారు.


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

దుండగుల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గుర్తు తెలియని దుండగుల దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని జంబువారిపల్లి పంచాయతీ దండువారి పల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి(50) ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద పడేశారు. శనివారం ఉదయం అటుగా వెళుతున్న వ్యక్తులు గమనించి పోలీసులు సమాచారం అందించారు. దీంతో అతనికి చికిత్సకు అందించి మెరుగైన చికిత్స కోసం తిరుపతి సిమ్స్ తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

ప్రజాశక్తి-గంగవరం: గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు గంగవరం పోలీసులు తెలిపారు. ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. రహస్యంగా బుధవారం ఉదయం రాబడిన సమాచారం మేరకు చెన్నై–బెంగళూరు రోడ్డు, చిన్నూరు ఫ్లై ఓవర్ వద్ద సోదాలు నిర్వహించామన్నారు. గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిలువెల్లా అల్లుకున్న నిర్లక్ష్యం

- ప్రమాదపు అంచుల్లో సిడి కండిగ గ్రామం


విద్యుత్ స్తంభానికి అల్లుకుని ఉన్న తీగలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆ గ్రామంలో విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకున్నాయి. స్థానికులు ఎవరైనా అటువైపుగా వెళితే ప్రమాదం పొంచి ఉంది అని సీడీ కండిగ గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు ఆ విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకొని ఉన్నా పట్టించుకోలేని ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలుపు టద్దంగా నిలుస్తుంది. సంబంధిత అధికారులు ఇంకనైనా స్పందించి ఆ తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.